వాడయ్యేను. స్త్రీజనాభ్యుదయ సంఘంవారు "కామిని" ని కళంకరహితగనే కాకుండా అనురాగ పూరితగా కూడా గుర్తించి స్వతంత్ర భారతదేశమందు కీర్తింపసాగిరి. సూరనేనినో— స్వతంత్రభారత దేశనాయకులెల్లరు ఆ సామాన్య వీరస్వర్గమును అశోకచక్ర పతాకచ్ఛాయనే చూఱగొన్న వాడని కొనియాడిరి!

.... .... .... .... ....

## కనుకట్టు పెళ్లి

"సిమ్మాది రప్పన్న - అన్నారపు సత్తెన్న
కొర్కొండ నర్సన్న - తిరుపతి వెంకన్న
మాయదారి దేవుళ్లు - మాటంటె పడబోరు
మనవాళ్ల తడిమేరు - నిలువెల్ల దోచేరు"

అని ఒకామె అంటూంటే, రెండో ఆమె "మనల్ని నిలువునా దోచుకునేది, మన మెడల్ని దిసమెడలగా జూపేది, మగవాళ్లేకాని దేవుళ్లుకాదు తల్లి! ఎందుకు తల్లీ! దేవుళ్ళను తిట్టడం? దేవుళ్ళను అనుకోవడం? మా ఆయన నాకు శుభ్రంగా శుద్ధమోక్షంచూపి, వస్తే రా అలా కొండకు, లేకుంటే ఇంటివద్దనే చావు అన్నాడు. మరి మీఆయన ఎలాంటివారో? కూడా వున్నారా? వచ్చారా?" అని మొదటి ఆమెయొక్క ముఖంకేసి చూసింది. అదాకా ఆమె పాటవినడమే గాని ఆమె ముఖంవంక చూచిందిలేదు. తానక్కడ కొండనుండి దిగుతూ పడిపోతానో అనే భయంకొద్దీ.

మొదటి ఆమె పడుచుపిల్ల, ఇరవైయేళ్లు ఉంటాయో ఉండవో, చిరునవ్వు నవ్వుతూ "కొండకొచ్చే వాళ్ళంతా

కోటీశ్వరులే కావాలా? కూడా కూడా మొగుళ్ళున్నవాళ్ళే రావాలా?" అంటూ వొయ్యారం వొలికించే చూపుల్తో చుట్టూ ప్రకృతి తిలకించింది, ఒకింత నిటాగ్గా నిలబడి నిట్టూర్పువుచ్చి అప్పటి అలసట తీజా!

నా సామిరంగా! కిందనుంచి ఎగరేసుకుంటూ పైకెగసే గద్దలా ఒక యువకుడు, అదే సమయానికి పైకెక్కుతూ, పడుచుపిల్లను నిలువునా చూచి, "నీ వొక్కతెవు కొండలట్టుకు తిరగనేర్చాక భయమన్న దెవరికింక? అలా నిలుసుండి పోనా వేం? తిరిగి మీద కెక్కుదాం అనావూహాఁ?" అని అడిగాడు. పడుచుపిల్ల "మఱెక్కలేనురా! ఇక్కణ్ణే కూకుంటాను రా! బేగివెళ్ళి వ్రతంముగించుకు మ్రొక్కుబళ్ళు చెల్లించుకు బేగిరా! నీకూ ఈవేళే ఇక్కడకు రావడానికి మంచిరోజు కుదరడమనేది అదో అందుకు మంచిదని అనిపిస్తోంది—వాడు చేసినమోసం అంతా ఇంతాకాదు. బేగివెళ్ళిరా!" అని అక్కడే ఆ మెట్టు మీదనే చతికిలబడింది. పెద్దమ్మి, ఎక్కే యువకుణ్ణి అక్కడే టక్కున ఆగిపోయిన యౌవనాంగినిచూస్తూ వాళ్ళ కామోద్రేకపు చూపుల్లో, తన కాలంనాటికధలూ కబుర్లూ తలపోసికొన్నదై, తలక్రిందులుగా కొండనుంచి దొర్లిపడిపోక పోయినా, పడిపోయినంత, మనోవిభ్రమంగా మఱీ మఱీ తన గతకాలాన్ని తలపోసికొంటూ, ఏదో కలలోంచి తేఱుకొన్నట్టు ఒక్క కేకేసింది. "ఉండండి! అక్కడ ఆగండి! అంత గబగబాదిగిపోతే ఏలా? కూడా వచ్చేదాకా చంపారు. ఇప్పుడు నీ తోడు నీవేచూచుకోమన్నట్టు ఏడనో ముప్పైమెట్లు దిగువనున్నారు! కన్నారా? ఈ చిత్రం మీరు? విన్నారా? ఈ చిత్రం మీరు?" అంటూ వాకే సొదగా అదే సుతిగా భర్తను పిలిచింది.

ఒకవిధంగా అరవైయేళ్ళున్న ఆవలిమనిషి, మగముసిలి అనండి, ముదిమొసలి అనండి, అతగాడు "త్వరగా దిగాలి! దిక్కులుచూస్తూ దిగితే పడిపోగలవు!" అని పైవంకకు తన చూపు తేల్చాడు. తన పెండ్లాం దిగుతూన్న మెట్టుమీదను చతికిల బడ్డ జవ్వాని అతనికక్కడపడింది. "ఆపిల్ల చేతులట్టుకుని దిగిరా! నేను రోడ్డుమీద బస్సును ఆపుచేస్తాను" అన్నాడు అదో వెఱ్ఱి వాలకంగా. ముసిలావిడకు ఎక్కడలేని వాయిసూ వోపిక ఒక్క త్రుటిలో వాళ్లోకొచ్చి పడ్డట్టు వచ్చిపడ్డాయి. కుచ్చెళ్లు సర్దుకుంటూ "అదిప్పుడప్పుడే దిగివచ్చే చోప్పుకాపడదు. దాని చెయ్యట్టుకు దిగేవాడు వేఱే వున్నాడు! దానికి నా చెయ్యి ఖర్మమేం? కన్నారా వాళ్ళిద్దరలోని కామోద్రేకపు మర్మమూను! మీరు దూరమైపోనారు. నేను కళ్ళారా చూచాను: ఉక్కుగుళ్ళలాంటి వొడళ్ళూ, సుళ్ళూవున్నవాళ్ళను గుళ్లోకి రానిచ్చే దేవుళ్ళను అనాలి గాని వాళ్ళను అనవలసిన పనిలేదు." అంటూ చదువు తూనే చకాచకాదిగి వూరుకుంది, మగనికంటె ముందుగా కొండ. మగడు "మనం మాత్రం మనవయస్సులో అలా అన్యోన్యం చూసుకోలేదటే? కాసు కూర్చోలేదటే దార్లంట బజార్లంట, సంబరాలకని సంతలకని?—ఇప్పుడా తిరుగుళ్ళకే మతో పేరెట్టి తిరుగుతున్నాము యాత్రలకని, పురాణాలకని! ఎప్పుడూ జోడా జోడాకే అనుకో ఏ దేవుడు చోటిచ్చినా, ఏ అర్చకుడు బాటిచ్చినా" "కాని వాళ్ళకు పెళ్ళికాలేదు"—"వాడిక్కాకపోతే కాకపోవచ్చు దానికీ కాలేదంటావా?" అని దీర్ఘంగా ఎగుచూపులు విసిరాడు వృద్ధుడు. "కాలేనట్టే తోస్తుంది. పెళ్లైయుంటే మెళ్లోపుస్తైనా వుండదూ?" అంది పెళ్ళాం.

కథ కసలీ మొగుడూ పెళ్ళాల గొడవ రథచక్ర రక్ష లాంటిదేగాని చక్రంకాదు. కథను నడిపించే చక్రాలు యువతీ యువకులయ్యారువురే! ముదుసళ్ళను మనమీపైనుండి విడిచి పుచ్చావచ్చు! విస్మరించావచ్చు!

అయ్యువకుడున్ను కొండమీద వ్రతం నెఱవేర్చుకున్న వాడై, తన వంతు ప్రసాదం తాను చేతబట్టుకుని, తిన్నగా, యువతి విశ్రమించి వెనుచూపులు చూస్తూవున్న సోపానంమీదకు వచ్చి ఆసీనుడైనాడు.

"వాడు రాత్రి నా మెళ్లో వస్తువు, వస్తువు వస్తువు, బంగారపుపేట ఎత్తుకు చక్కాపోయాడు: ఏమీ తోచక ఎవరి తోనూ చెప్పుకోనేరక ఇలా ఈ కొండమీద కొచ్చేశాను," అని సూటిగా తనకు వాటిల్లిన ముప్పును గురించి చెప్పింది యయ్యువతీలలామ, యువకుడు నిబ్బరంగా ఆమె మెడవంక పరికిస్తూ "పుస్తెసమేతంగా?" అని ప్రశ్నించాడు.

"వాడెవడు నాకు పుస్తెకట్టెందుకు?" అంది.

—"నిన్ను పెళ్ళిచేసుకున్నా డన్నారందఱూ?"

—"అదో నటనానాటకం సాగించాము. పుస్తెకట్టిందీ లేదు. ఆఖరుకు పసుపుకొమ్మైనా ముట్టించిందీలేదు. వాడు నా మెడను అంటుకోలేదు. గుమ్మంలో బాజాలుమాత్రం బడా బడా మోగింపించాం. దర్వాజాలు దభీదభీమని వేసేయింపించాం! తుదకు అర్ధరాత్రివేళ వాడుచేసిన పనియిది! నా మెళ్లో వుంటూ వచ్చిన బంగారుపేట హరించేసి మటుమాయమయ్యాడు. కాన రాడే యీకోన?" అంది కళ్ళనీళ్ళెట్టుకుంటూ ఆ కామిని.

వాళ్ళ యిరువురిమీద, ఆకులెంతమాత్రమూలేని అంతా పువ్వేపూసియున్న దేవగన్నేరు చెట్లనీడలు, లేళ్ళమీద మచ్చ

మచ్చల్లా వ్యాప్తమై, అసంఖ్యాకములుగా పొడగడుతూవున్నాయి. ఎదర పంపానదీ సైకతం మీది సూర్యరశ్మి కనకనమంటూ, వాళ్ళ యిద్దరి కళ్ళల్లోకి క్రేళ్లురుకుతూ కేరింతాలు కొడుతూవుంది.

"ఇక్కడుంటానన్నాడా వాడు?" అని అడిగాడు యువకుడు. "వాడుంటాడనా వచ్చిందినేను? తోచకవచ్చానని చెప్పలే? ఈ కొండమీదను జరిగే సంఘవ్రతాలు, లోకసంగ్రహ సమారాధనలు, సార్వజనీన కథోపన్యాసాలు, కలిమిడి, చలిమిడి తలపోతకు తెచ్చే ప్రసాదం ఇవన్నీ ఇక్కడకు ఇలా నన్ను చేరుకునేటట్టు చేశాయి" అంది యువతి. "నా సాక్షిగా, ఈ దేవుడి సాక్షిగావాడు నీకు పుస్తెకట్టలేదందు?" అని రెట్టించి అడిగాడు యువకుడు. "ఉఁ ఉఁ" అని లేదన్నట్టు బుర్ర తిప్పింది—"కట్టినట్టు చూచినవాళ్ళు సాక్ష్యం ఇస్తే?"—"ఓ? అదా నీ సంకోచం? లోకంలో గారడీఆంటూ లేదట్రా? కను కట్టంటూలేదట్రా? అలాంటి మాయలో ఆ చూచినవాళ్ళు పడి పోయారని మనం అనుకోవలసిందేకాని—నాకు పెళ్ళి అయిందని సుతరాం నమ్మరాదు"

యువకుడు తొడుక్కున్న చొక్కా ప్రక్క జేబున్న పార చూట్ సిల్కుచొక్కా! ట్రాన్సు పారెంటుది! లోపలి నెట్ బనియను చేతులులేనిది ఎగుబుజాల్నిదాసి లోలో కనిపిస్తూవుంది. కట్టిన పంచెకూడా గ్లాస్గో మల్లుపంచి. రూపురేఖలున్న తత్తుల్యాలే! శిరసునుండి సీలమండవఱకు ఏకండీ నలుపు. కండ బలుపు, మండమలుపు సూచిస్తూ "పాటకపు నీటుగాడురా అత గాడు" అని చాటుతూవున్నాయి. యువతి చుక్కలద్దకపు చీర కట్టిందై, కుట్టో కత్తిరింపో తెలియనంతటి గుట్టుతోను

కూర్మితోను తొడిగిన రయిక నట్టట్టనిపించినదై, ముఖాన్న దమ్మిడికాసంత కుంకుమ ఉంచుకున్నదై, దువ్వినతలో దువ్వని తలో అన్నంత యిదిగా నొక్కులకు నొక్కులూ, నునుపుకు నునుపూ చూపిస్తూవున్నదై, రూపమంతా తాపమన్నట్టు, తాప మంతా పాపమన్నట్టు, పాపమంతా శాపమన్నట్టు, జాలిగొల్పుతూ జాలిగుండానే లీలనెరపుతూ విచ్చేర చేగూర్చింది.

తన జేబులో చెయ్యిపెట్టి పీటుకాడో అగ్గిపెట్టితీస్తూ పెట్టితోపాటో సిగరెట్టుకోస్తూ, దాన్ని పెట్టెమీద అట్టెదులిపి, పెట్టెలోని అరవలా తోశాడు పుల్లకోపం. అరఅరా లుడుంగున ఊడిపడింది దిగువమెట్టుమీదకు. పుల్లలన్నీ దొర్లిపోయినాయి. పిల్లవెంటనే ఆ పుల్లలన్నీ ఏరుతూ, "ఎన్నుండాలిరా ఇవి?" అని—వాడు "నలబై యేడుండాలి" అవి అంటే—నలబై యేడూ ఉన్నాయోలేదో అని లెక్కిస్తూవుంది. వాడు, ఆ పీటు కాడు, పెరచేతను జేబులోంచి ఎదో వస్తువు బంగారపుది పైకి నీటికట్టులా ఎత్తిపట్టి, పిల్లమేడలో పడేశాడు. అగ్గిపుల్లల లెక్కను ఏమఱుపాటుగానున్న పిల్ల ఉలిక్కిపడి, ఉల్లముకు చల్లగా తగిలిన బంగారాన్ని తఱుక్కుమని, పీటుకాడి చేతిలోని ఉత్త అగ్గిపెట్టె డొక్కును ఊడలాక్కుంటూ "ఈ నానుపేట నాదే! వాడు రేత్రి దొంగిలించుకుపోయిందే! నీ చేతిలో కెలా వచ్చింది?" అని అడిగింది. "ఏలా వస్తుంది. కిస్మత్ గుడ్ లక్! వుంటే వస్తుంది. నీవిప్పుడిలావచ్చినట్టే! డిసెల్ హడా విడిగా ఎక్కుతూవున్న ఒకానొక షరాబు జేబులోంచి పచ్చ పచ్చగా ఇది తొంగిచూస్తూంటే—నా స్లైట్ ఆఫ్ హేండ్! నీవెరుగుదుగా! కొట్టేసుకొచ్చాను వెంటనే బస్సుఎక్కి ఇలా!

సమయానికి నీవిక్కడుండడం మెలుగిచ్చింది" అన్నాడు. "నాకా ? నగకా ?" అని అడిగింది పిల్ల. "మనకు" అన్నాడు యువకుడు.

అంటే యువతికి ఆ మాట అర్థంకాలేదు. "పోలీసు లడిగితే—" అని అరోక్తిగా యూరుకొన్నాడు యువకుడు. "ఈ పేట నాదంటాను. కాని, ఈ పుస్తెలను గురించేవాడు. ఇవి షరాబు వేలాగున్నాయి, ఏలా ?" అని అడిగింది పిల్ల ఎప్పటి లోకంలో దిగి. "పుస్తెలు నేను నీకుకట్టినవంటాను !" అన్నాడు యువకుడు. "మఱీ కనుకట్టుగావుందే నీ వ్యాపారం" అంటూ గుడ్లెఱ్ఱ చేసింది యువతి.

యువకుడు తొణక్కుండా "కించిత్ ప్రసాదం కళ్ళ నద్దుకు తీసికో నేనిచ్చేది" అని ప్రక్కనుంచుకున్న అడ్డాకు పొట్లంవిప్పి ఆమెకు చూపాడు. యువతి అదిపుచ్చుకు చలవ కళ్ళ నద్దుకు ఆహరిస్తూ "నా ప్రసాదమో ?" అని తన పొట్లం విప్పి ఒకించుక ఉండ ఇచ్చింది వాడికి. అది ఆయ్యువకుడు తింటూ, శ్రీ వీరవెంకట సత్యనారాయణమూర్తి కృపాప్రసాద మున ఆ యువతికి భర్తై యూరుకున్నాడు.

ఊరకున్నాడా ? దివ్యుడైనాడు. ఆ యువతి తేజోరాశి అయింది. వాళిద్దఱిమీదా ఆ కొండను పూచిన పువ్వులన్నీ గ్రుచ్చకుండానే దండలై మెడల నమరినాయి.

ఆ పూల దండలు వాడినప్పుడల్లా ఉర్దూలో "తళక్" అని వాసించినప్పుడల్లా హిందీలో "మిళావ్" అని ఆకాశవాణి పలుకుతూ వుంటుంది కోన కోన మాఱు మ్రోగేలా !

.... .... .... .... ....